క్లుప్తంగా

వైద్య సిబ్బందితో సమీక్ష

సీతానగరం: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ ఏవీకే చైతన్య సోమవారం ఏఎన్ఎంలు, సచివాలయ ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలతో సమీక్షించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు. మండలంలో గర్భిణుల వివరాలు తెలుసుకున్నారు. ఎంత మంది పిల్లలకు టీకాలు వేశారో ఆరా తీశారు. మండలంలో టీబీ రోగులకు వైద్యసేవలు, వారి ఆరోగ్య పరిస్థితిపై ప్రశ్నించారు.

ధనలక్ష్మీదేవిగా దుర్గాదేవి


ధనలక్ష్మీదేవి అలంకరణలో అమ్మవారు

అనపర్తి: శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని మండలంలోని వివిధ గ్రామాల్లోని ఆలయాల్లో కొలువుదీరిన అమ్మవార్లకు భక్తులు విశేష పూజలు నిర్వహిస్తున్నారు. స్థానిక మార్కండేయపురంలోని శ్రీభావనాఋషి ఆలయంలో కొలువుదీరిన దుర్గాదేవి సోమవారం ధనలక్ష్మీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ

బిక్కవోలు: మండలంలోని ఊలపల్లి గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణానికి ఎంపీటీసీ సభ్యుడు బండారు శివ సోమవారం భూమి పూజ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోతుల ప్రసాద్‌రెడ్డి, పంచాయతీ వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

డేటా ఎంట్రీ ప్రక్రియ వేగవంతం చేయాలి


ఏపీత్రయంలో రీసర్వే డేటా ఎంట్రీ ప్రక్రియను పరిశీలిస్తున్న తహసీల్దార్ టి.సుభాష్

పెదపూడి: జగనన్న శాశ్వత భూహక్కు భూరక్ష రీ సర్వే డేటా ఎంట్రీ ప్రక్రియ వేగవంతం చేయాలని తహసీల్దార్ టి.సుభాష్ అన్నారు. మండలంలోని ఏపీత్రయం, రామేశ్వరం గ్రామ పంచాయతీల్లో జరుగుతున్న రీసర్వే డేటా ఎంట్రీ ప్రక్రియను ఆయన సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో రీసర్వే చేసే ముందు రైతులకు సమాచారం, నోటీసులు ఇవ్వాలన్నారు. రీసర్వేకు రైతులు, ప్రజలు సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ త్రివేణి, వీఆర్వోలు గొల్లపల్లి అంజిబాబు, కరెడ్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

700 క్యూసెక్కుల సాగునీరు విడుదల

సీతానగరం: పురుషోత్తపట్నంలోని తోట వెంకటాచలం పుష్కర ఎత్తిపోతల పథకం నుంచి 700 క్యూసెక్కుల సాగునీటిని మెట్ట ప్రాంత పొలాలకు విడుదల చేశామని జలవనరులశాఖ డీఈ వెంకట్రావు సోమవారం తెలిపారు. పుష్కర-1 నుంచి రెండు మోటార్లు, పుష్కర-2 నుంచి రెండు మోటార్లు ద్వారా నీటిని వదిలామన్నారు. గోదావరి నీటిమట్టం 18.3 మీటర్లు ఉందని తెలిపారు.

వెలివేశారు, న్యాయం చేయండి


వినతిపత్రం అందజేస్తున్న బాధితురాలు

రాజానగరం: ఒంటరి మహిళలనైన తనను తన సంఘీయులే వెలివేసి, వేధింపులకు గురిచేస్తున్నారని, విచారణ జరిపించి న్యాయం చేయాలని కోరుతూ మండలంలోని నరేంద్రపురానికి చెందిన గుత్తుల కృష్ణవేణి స్పందన కార్యక్రమంలో అధికారులను వేడుకుంది. నాలుగేళ్లుగా కూలి పనులు కూడా దొరకుండా చేస్తున్నారని, దీనితో బతకడం భారంగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేసింది. విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకువెళ్తామని అధికారులు తెలిపారు.

ఎస్సీలను వేధిస్తున్నారనడంలో నిజం లేదు

రంగంపేట: మండలంలో ఎస్సీలను ఇతర సామాజిక వర్గాలు వేధిస్తున్నాయంటూ ఇటీవల మండలానికి చెందని కొందరు ఎస్సీ నాయకులు ప్రచారం చేయడంలో ఏమాత్రం నిజం లేదని ఎస్సీ ప్రజాప్రతినిధులు హితవు పలికారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద సోమవారం వారు విలేకర్లతో మాట్లాడుతూ ఈ నెల 21వ తేదీన మండల సమావేశంలో పీహెచ్‌సీ డాక్టర్ లావణ్యకు జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబుకు జరిగిన చిన్నపాటి వాగ్వాదాన్ని కులానికి ఆపాదిస్తున్నారని అది సమంజసం కాదన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కొల్లాటి ఇజ్రాయిల్, మండలంలోని పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

పంట నమోదు.. ప్రయోజనాలు బోలెడు

- ఈ-క్రాప్ బుకింగ్‌కు సెప్టెంబర్ 17 వరకూ అవకాశం
- నమోదు చేసుకుంటే ఎంతో మేలు


రంగంపేటలో ఈ-క్రాప్ బుకింగ్ చేస్తున్న వ్యవసాయ సిబ్బంది

రంగంపేట: రైతు సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తున్నారు. పంట సాగులో ప్రతీ దశలోను సహకారం అందిస్తూ రైతు పక్షపాతిగా పేరు పొందారు. దేశంలోనే ఆదర్శంగా పథకాలు అందిస్తూ వ్యవసాయం దండగ కాదు పండగ అని నిరూపిస్తున్నారు. సాగు ప్రయోజనాలు సక్రమంగా అందించేందుకు ప్రవేశపెట్టిన ఈ-క్రాప్ విధానం రైతులకు వెన్నుదన్నుగా నిలుస్తుంది. ఆయా గ్రామాల్లోని ఖరీఫ్‌లో రైతులు సాగుచేసిన వివిధ రకాల పంటలను రైతు భరోసా కేంద్రంలో రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. ఈ-క్రాప్ బుకింగ్‌పై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. వ్యవసాయ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది క్షేత్రస్థాయిలో పంట పొలాల్లోకి వెళ్లి పంటలను నమోదు చేస్తున్నారు. సెప్టెంబరు 15 వరకూ మాత్రమే సమయం ఉండటంతో రైతులందరూ ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ఇప్పటికే గతంలో ఎన్నడూ లేని విధంగా ఖరీఫ్ సీజన్‌లో దాదాపు 8 వేల ఎకరాలు సాగులోకి వచ్చినట్టు వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

ఈ-క్రాప్ బుకింగ్‌తో ప్రయోజనాలెన్నో

గతంలో ఎన్నడూ లేని విధంగా గత ఖరీఫ్‌కు సంబంధించిన పంటల బీమాను రైతుల ఖాతాల్లో జమ చేసిన సంగతి తెలిసిందే. ఈ-క్రాప్ బుకింగ్ నమోదు చేయించుకోవడం ద్వారా ఏదైనా కారణంతో పంట నష్టపోతే ప్రభుత్వం నుంచి వచ్చే పరిహారం దళారుల చేతికి వెళ్లకుండా లబ్ధిదారుల ఖాతాలోకే జమవుతుంది. పంట నమోదులో ఏ రైతు ఎంత విస్తీర్ణంలో పంట సాగు చేశారో స్పష్టంగా తెలుస్తుంది. పంట దిగుబడులను అంచనా వేయడంతో పాటు పంట మార్పిడికి అవకాశం ఉంటుంది. గతంలో పంటల బీమా పథకానికి దరఖాస్తు చేసుకోవాలని సగం డబ్బులు రైతులు చెల్లిస్తే మిగతా సొమ్ము ప్రభుత్వం చెల్లించేది. ఇందులో ఉన్న లోపాలను గుర్తించి ప్రభుత్వం స్వయంగా బీమా ప్రీమియం చెల్లించే విధంగా చర్యలు తీసుకుంది.

మండలంలో ఎంత విస్తీర్ణంలో సాగు భూమి ఉంది, ఏ సీజన్‌లో ఏఏ పంటలు ఎంత విస్తీర్ణంలో సాగు చేశారు తదితర వివరాలను క్షుణ్ణంగా ఆన్‌లైన్‌లో పొందుపరుస్తున్నారు. పండించిన పంట దిగుబడులను గిట్టుబాటు ధరకు అమ్ముకోవడానికి ఈ-క్రాప్ ఎంతో సహాయపడుతుంది. వైఎస్సార్ యంత్రసేవ పథకం అమలు, నాణ్యమైన ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు రైతు భరోసా కేంద్రాల ద్వారా లభ్యమవుతున్నాయి.

మద్దతు ధర లభిస్తుంది



ఏ సీజన్‌లో ఏ పంట వేసినా క్రమం తప్పకుండా ఈ-క్రాప్ బుకింగ్ చేయించుకుంటున్నాను. పంట దిగుబడులను ప్రభుత్వమే కొనుగోలు చేసి, మద్దతు ధర కల్పిస్తుంది. దళారీ వ్యవస్థ లేకుండా నేరుగా దిగుబడులను అమ్మడం వల్ల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేస్తున్నారు. అలాగే సబ్సిడీతో నాణ్యమైన ఎరువులు, విత్తనాలు పొందుతున్నాను.

– నలమాటి భీముడు, రైతు, వడిశలేరు

వంద శాతం పూర్తి చేస్తాం



మండలంలో ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన ప్రతి పంటను ఈ-క్రాప్‌లో నమోదు చేసే కార్యక్రమాన్ని వేగవంతం చేశాం. రైతుల పొలం వద్దకే వెళ్లి పంటల వివరాలను నమోదు చేస్తున్నాం. ప్రభుత్వం నిర్ణయించిన గడువులోగా వంద శాతం నమోదు పూర్తి చేసి లక్ష్యాన్ని సాధిస్తాం.

– కె.శ్రీనివాసరావు, మండల వ్యవసాయాధికారి, రంగంపేట

చవితి ఉత్సవాలకు రాట ముహూర్తం


చవితి ఉత్సవాలకు రాట ముహూర్తం చేస్తున్న ఏఎంసీ మాజీ చైర్మన్ జంగా వీర వెంకట సుబ్బారెడ్డి

బిక్కవోలు: స్థానిక బిక్కవోలు శ్రీలక్ష్మీగణపతి ఆలయం వద్ద ఏఎంసీ మాజీ చైర్మన్ జంగా వీర వెంకట సుబ్బారెడ్డి వినాయక చవితి ఉత్సవాలకు సోమవారం రాట ముహూర్తం చేశారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సెప్టెంబరు 18న మొదలుకానున్న చవితి ఉత్సవాలు 27వ తేదీన మహా అన్న సమారాధనతో ముగుస్తాయని వీరవెంకట సుబ్బారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ తమ్మిరెడ్డి నాగ శ్రీనివాస్‌రెడ్డి, ఆలయ ఈవో రామలింగ భాస్కర్, గువ్వల సత్తిరెడ్డి, వై.రవి, జంగా గంగాధర్‌రెడ్డి, యామన దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

రాజీ మార్గమే రాజమార్గం


అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి పి.చైతన్య

అనపర్తి: రాజీ మార్గమే రాజమార్గమని అనపర్తి జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి పి.చైతన్య అన్నారు. వచ్చే నెల 9వ తేదీన నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా సోమవారం స్థానిక కోర్టు ప్రాంగణంలో కక్షిదారులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ రాజీకి ఆమోదయోగ్యమైన వివిధ రకాల కేసులు లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. సెప్టెంబర్ 9న జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీపీ బి.సిద్ధార్థ, ఏజీపీ వెలగల లక్ష్మీనారాయణరెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పీవీ రామకృష్ణ, కార్యదర్శి కె.శ్రీధర్‌రెడ్డి, న్యాయవాదులు పాల్గొన్నారు.

జగన్ పాలనలో అభివృద్ధి పరుగులు

- పేదల జీవితాలకు ఆర్థిక భరోసా
- కణుపూరులో ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- ఉత్సాహంగా గడప గడపకూ..


కణుపూరులో ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

మధురపూడి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో పల్లెల్లో అభివృద్ధి పరుగులు తీస్తోందని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. కోరుకొండ మండలం కణుపూరులో సోమవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా స్థానిక విఘ్నేశ్వరస్వామి ఆలయంలో స్వామిని దర్శించుకున్నారు. గ్రామ సచివాలయం సమీపం నుంచి ప్రారంభమైన కార్యక్రమం బీసీ పేటల్లో జరిగింది. ఈ సందర్భంగా ఆయనకు అక్క చెల్లెమ్మలు హారతులతో ఘనంగా స్వాగతం పలికారు.

రూ.5.20 కోట్లతో అభివృద్ధి పనులు

ఎమ్మెల్యే రాజా మాట్లాడుతూ కరోనా వంటి విపత్కర పరిస్థితిలోనూ జగనన్న ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేసిందన్నారు. కణుపూరు, రాజవరం గ్రామాలను రూ.5.20 కోట్లతో అభివృద్ధి చేసినట్టు తెలిపారు. అలాగే 4,936 మంది లబ్ధిదారులకు రూ,11,58,30,283 సంక్షేమ పథకాల పేరిట బ్యాంకు ఖాతాల్లో జమచేసినట్టు తెలిపారు. జగనన్న అమ్మవడి, జగనన్న చేదోడు, వైఎస్సార్ కాపునేస్తం, వైఎస్సార్ ఆరోగ్య శ్రీ, వైఎస్సార్ ఈబీసీ నేస్తం, వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ జలకళ, వైఎస్సార్ సున్నా వడ్డీ, వైఎస్సార్ బీమా, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ పింఛన్ కానుక తదితర పథకాలు అర్హులందరికీ అందజేయాలన్న లక్ష్యంతో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. చంద్రబాబు ఐదేళ్ల పాలనలో కేవలం రూ. 89 లక్షలు మాత్రమే కేటాయించగా, జగన్ పాలనలో నాలుగేళ్లలో రూ.5.20 కోట్లు కేటాయించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కరణం రమణ, జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ నక్కా రాంబుబు, పార్టీ మండల కో కన్వీనర్ గణేశుల పోసియ్య, పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు సూరిశెట్టి కుటుంబరావు, కణుపూరు ఎంపీటీసీ సభ్యుడు దొడ్డి జయలక్ష్మి, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సభ్యుడు ఇండిగమెల్లి సత్యనారాయణ, పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు ఎరుబండి సత్తిబాబు, పార్టీ స్థానిక నాయకులు జాజుల నాగేశ్వరరావు, కళ్యాణం చిట్టిబాబు, కళ్యాణం రాంబాబు, మంచాల చిట్టిబాబు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు

కంబాలచెరువు: పాఠశాల స్థాయి నుండే విద్యార్థులకు శాస్త్ర విజ్ఞానంపై ఆసక్తిని పెంచాలని డీఎంహెచ్ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు ఎస్.రాజా ప్రశాంత్ అన్నారు. ఆ పాఠశాలలో సోమవారం జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ శాస్త్రజ్ఞుల సేవలు దేశ పురోభివృద్ధికి ఎంతగానో దోహదపడతాయన్నారు. ఇటీవల చంద్రయాన్ 3 ప్రయోగం విజయవంతమైన సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. వాటిని ఉపాధ్యాయుడు ఎల్.ప్రభాకరరావు సమకూర్చారు. జూనియర్ విభాగంలో ముగ్గురు, సీనియర్ విభాగంలో ముగ్గురిని బహుమతులు ప్రదానం చేశారు.

2,3 తేదీల్లో మంగళగిరిలో జాబ్‌మేళా

సీటీఆర్ఐ: భారత చైతన్య యువజన (బీసీవై) పార్టీ జాతీయ అధ్యక్షుడు బోడె రామచంద్ర యాదవ్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 2, 3 తేదీల్లో మంగళగిరిలో ఉద్యోగ మేళా నిర్వహించనున్నారని ఆ పార్టీ నాయకుడు అత్తిలి రాజు అన్నారు. ఈ మేరకు సోమవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. పదో తరగతి, డిగ్రీ, పీజీ చదివిన 18 ఏళ్ల నుంచి 35 ఏళ్లలోపు అభ్యర్థులు అర్హులన్నారు. సుమారు 500 కంపెనీల ద్వారా 50 వేలకు పైగా ఉద్యోగాలను భర్తీ చేస్తారన్నారు.

ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరువ చేయాలి


బిక్కవోలు సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కొవ్వూరి జ్యోతిర్మయి

బిక్కవోలు: ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరువ చేయడానికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఎంపీపీ కొవ్వూరి జ్యోతిర్మయి అన్నారు. సోమవారం ఆమె అధ్యక్షతన జరిగిన బిక్కవోలు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ జ్యోతిర్మయి మాట్లాడుతూ నిరుపేదల జీవితాల్లో వెలుగులు నింపేందుకు ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందన్నారు. ఆయా పథకాలను అర్హులందరికీ చేరవేసేందుకు అందరూ కలిసికట్టుగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రొంగల పద్మావతి, ఎంపీడీవో జేఏ ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

బైబిల్ అధ్యయనంతో శాంతి

మధురపూడి: బైబిల్‌ను నిరంతరం అధ్యయనం చేయడంతో శాంతి, సహనం లభిస్తాయని ఆర్‌సీఎం ఫాదర్ రెవరెండ్ మనోజ్ కుమార్ అన్నారు. కోరుకొండ మండలం బూరుగుపూడి ఆర్‌సీఎం చర్చిలో సోమవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మణిపూర్‌తో పాటు, దేశంలో శాంతి నెలకొనాలని ప్రార్థనలు చేశారు. ఉపదేశి కొల్లి జాకబ్, సంఘ పెద్దలు పాల్గొన్నారు.

దేవాలయాల అభివృద్ధికి కృషి


పుట్టకొండలో ఆలయ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి దంపతులు

పెదపూడి: నియోజకవర్గంలో దేవాలయాల అభివృద్ధికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని పుట్టకొండ గ్రామంలో ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు వినాయకుడి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన, భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి మంజూరైన రూ.10 లక్షల నిధులతో ఈ నిర్మాణం చేపడుతున్నామన్నారు. ఆలయాల నిర్మాణానికి దాతలు సహకారం అందించాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణరెడ్డి దంపతులను గ్రామ పెద్దలు సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ కేతా తులసి, జెడ్పీటీసీ సభ్యురాలు పేపకాయల వెంకటలక్ష్మి, సర్పంచ్ వల్లు వెంకటరమణ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి అద్దంకి ముక్తేశ్వరరావు, మండల సర్పంచుల సమాఖ్య అధ్యక్షుడు కోసూరి వాసు, అనసూరి దుర్గాప్రసాద్, మట్టా గోవిందు, కడిమి కోదండరాముడు, కేతా సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్‌బోర్డు అధికారిపై అసత్య ప్రచారం తగదు


సమావేశంలో మాట్లాడుతున్న వక్ఫ్ బోర్డు జిల్లా అధ్యక్షుడు మహ్మద్ ఆరీఫ్

ప్రకాశం నగర్: ఆంధ్ర ప్రదేశ్ వక్ఫ్‌బోర్డ్ ప్రత్యేక అధికారి, ఐపీఎస్ ఆఫీసర్ షీరీన్ బేగంపై కొందరు టీడీపీ నాయకులు అసత్య ప్రచారాలు చేసి, ఇబ్బందులకు గురి చేయడం దారుణమని వక్ఫ్‌బోర్డ్ జిల్లా అధ్యక్షుడు మహ్మద్ ఆరీఫ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. జాంపేటలోని తన కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. మైనారిటీ హక్కుల సంఘం పేరుతో మైనారిటీ మహిళ గౌరవ ప్రతిష్ఠకు భంగం కలిగించేలా వ్యవహరించడం సిగ్గుచేటు అన్నారు. వక్ఫ్ బోర్డ్ ఆస్తుల పరిరక్షణ కోసం నిజాయితీగా కృషి చేస్తున్న షీరీన్ బేగంపై, అక్రమార్కులకు కొమ్ముకాస్తున్న టీడీపీ ఏజెంట్ ఫారూఖ్ షుబ్లి అనుచిత వ్యాఖ్యలు చేయడం దుర్మార్గమైన చర్య అన్నారు. గత ప్రభుత్వం వక్ఫ్ బోర్డును అవినీతిమయం చేసి, వేల ఎకరాల భూములను అన్యాక్రాంతమయ్యేలా చేసి మైనారిటీలకు తీవ్రమైన ద్రోహం చేసిందన్నారు. అటువంటి సమయంలో ఫారూఖ్ షుబ్లి ఎక్కడ దాక్కున్నాడని ప్రశ్నించారు. ముస్లింల ఆస్తుల పరిరక్షణ కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాలతో నిజాయితీగా పనిచేస్తున్న ముస్లిం అధికారులపై కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు.

డాక్టర్ లావణ్యపై 'స్పందన'లో ఫిర్యాదు


డీఆర్ఓ నర్సింహులుకు ఫిర్యాదు చేస్తున్న రంగంపేట ప్రజాప్రతినిధులు, నాయకులు

రంగంపేట: స్థానిక పీహెచ్‌సీ వైద్యురాలు దాసి లావణ్యను విధుల నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ రాజమహేంద్రవరం కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో డీఆర్ఓ నర్సింహులుకు మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఫిర్యాదు చేశారు. అనంతరం జెడ్పీటీసీ రాంబాబు మాట్లాడుతూ రంగంపేట మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 21న జరిగిన మండల సమావేశం సందర్భంగా వైద్య శాఖ వివరాలను వివరించాలని అడిగిన తనతో పాటు కోటపాడు ఎంపీటీసీ సుంకర అప్పారావు, ఇతర ప్రజాప్రతినిధులపై డాక్టర్ లావణ్య కుటుంబ సభ్యులు, అనుచరులతో దుర్భాషలాడుతూ దాడికి పాల్పడ్డారన్నారు. ఘటనపై ఈ నెల 24న రంగంపేట పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైందని చెప్పారు. డాక్టర్ లావణ్యను వెంటనే సస్పెండ్ చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీ కో-ఆప్షన్ సభ్యుడు లంక చంద్రన్న, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కొల్లాటి ఇజ్రాయిల్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నల్లా శ్రీనివాసరావు, ఏఎంసీ వైస్ చైర్మన్ అడబాల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు ఇబ్బంది లేకుండా వైద్యసేవలు


వైద్యాధికారులతో మాట్లాడుతున్న అసిస్టెంట్ కలెక్టర్ యశ్వంత్‌కుమార్ రెడ్డి

రాజమహేంద్రవరం రూరల్: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చే గర్భిణులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు సమయాన్ని కేటాయిస్తూ, అదేరోజు వారికి అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించాలని అసిస్టెంట్ కలెక్టర్ యశ్వంత్ కుమార్ రెడ్డి సూచించారు. బొమ్మూరులోని డీఎంహెచ్‌వో కార్యాలయాన్ని సోమవారం ఆయన సందర్శించారు. జిల్లాలో అమలవుతున్న వైద్య, ఆరోగ్య శాఖ కార్యక్రమాలపై ఆరా తీశారు. అధికారులకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ప్రతినెలా తొమ్మిదో తేదీన గర్భిణులకు పీహెచ్‌సీల్లో ఆరోగ్య పరీక్షల సమయాలను ముందుగానే తెలియజేయాలన్నారు. లెప్రసీ, క్షయనివారణాధికారి డాక్టర్ ఎన్.వసుంధర పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లాలో అమలవుతున్న అన్ని కార్యక్రమాలను వివరించారు. డాక్టర్లు రాజీవ్, అభిషేక్ రెడ్డి, ఎపిడమాలజిస్ట్ సుధీర్, జిల్లా మలేరియా అధికారి వీర్రాజు, శ్రీవల్లి, జిల్లా ఇమ్యూనికేషన్ అధికారి రాజకుమారి, లావణ్య, డిప్యూటీ డెమో సత్య కుమార్, రవికుమార్ తదితరులు శాఖల పరంగా అమలు చేస్తున్న కార్యక్రమాలను వివరించారు. ఎన్‌హెచ్ఎం డీపీఓ సంధ్యారెడ్డి, సీహెచ్ఓ వెంకటరత్నం, డీపీహెచ్ఎన్ఓ వసంత కుమారి పాల్గొన్నారు.

ఐదుగురిపై పిచ్చికుక్క దాడి

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరం వెలమపేటలో పిచ్చికుక్క సోమవారం స్వైరవిహారం చేసింది. ఐదుగురిపై దాడి చేసి గాయపరిచింది. దీంతో ఆ ప్రాంత వాసులు బెంబేలెత్తిపోయారు. కొందరు యువకులు కర్రలతో పిచ్చికుక్కపై దాడి చేసి హతమార్చారు.

111 మంది తెలుగు కవుల ఫొటోల అందజేత


ఉపాధ్యాయుడు సత్యనారాయణ అందజేసిన తెలుగు రచయితల చిత్రపటాలతో స్కూలు విద్యార్థులు, ఉపాధ్యాయులు

కడియం: తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ తెలుగు ఉపాధ్యాయుడు, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత గొల్లపల్లి సత్యనారాయణ రూ.3,500 విలువైన 111 మంది తెలుగు కవులు, కవయిత్రిలు, రచయితల ఫొటోలను స్కూలుకు అందజేశారు. వీటిని స్కూలు గ్రంథాలయంలో ఉంచి విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు వినియోగిస్తారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హెచ్ఎం టి.సత్యనారాయణ మాట్లాడుతూ తెలుగు భాషకు విశేష సేవలందించిన ఈ ప్రముఖుల జీవిత విశేషాలు విద్యార్థులకు స్ఫూర్తినిస్తాయన్నారు. వారిపై అవగాహన పెంచుకోవడానికి, తద్వారా భాషపై ఇష్టాన్ని కలిగించడానికి తోడ్పడతాయన్నారు. ఈ సందర్భంగా తెలుగు ఉపాధ్యాయుడు సత్యనారాయణను అభినందించారు. శరత్‌బాబు, పెర్సీ, గిరిజ, విద్యార్థులు పాల్గొన్నారు.

31న జిల్లాస్థాయి ఎంపికలు

ప్రకాశం నగర్: రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాలలో ఈనెల 31న రాష్ట్రస్థాయి సివిల్ సర్వీసెస్ క్రీడల జిల్లాస్థాయి ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ముఖ్య క్రీడాశిక్షకుడు డీఎంఎం శేషగిరి సోమవారం ప్రకటనలో తెలిపారు. పురుషుల, మహిళల విభాగంలో అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, బాస్కెట్ బాల్, క్యారమ్స్, చదరంగం, క్రికెట్, పుట్‌బాల్, హాకీ, కబ్బడీ, లాన్ టెన్నిస్, స్విమ్మింగ్, ఖోఖో, వెయిట్ లిఫ్టింగ్, టేబుల్ టెన్నిస్, వాలీబాల్, యోగా, రెజ్లింగ్ వంటి పోటీల్లో ఎంపికలు జరుగుతాయన్నారు.